
సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 25 । ఆగస్టు । 2025



ఎన్నాళ్లీ ఎదురుచూపులు

మోదేలు గ్రామానికి మంజూరైన గృహాలు నిర్మించడంతోపాటు రోడ్లు, విద్యుత్ సదుపాయం కల్పించాలని ఆ గ్రామ గిరిజనులు కోరుతున్నారు. 8లో



టీడీపీ నేత అరాచకంపై ఆగ్రహం

కూటమి ప్రభుత్వంలో సాక్షాత్తు తమ నాయకులతో సహా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆ పార్టీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8లో



బాడీ బిల్డింగ్ పోటీలు

మిస్టర్ భీమవరం బాడీ బిల్డింగ్ పోటీలు న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

సత్వర న్యాయానికి కృషి



మాట్లాడుతున్న జస్టిస్ కృష్ణమోహన్

నరసాపురం: నిబద్ధత, అంకితభావంతో పని చేసి ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ న్యాయవాదులకు సూచించారు. ఆదివారం నరసాపురం వచ్చిన ఆయన న్యాయవాదుల సంఘం బార్ అసోసియేషన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. రోజురోజుకూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా న్యాయవాదులు తమ న్యాయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులు న్యాయపరమైన అంశాలపై, చట్టాలపై, న్యాయశాస్త్ర సూత్రాల పై చర్చా వేదికలు నిర్వహించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. న్యాయస్థానాల్లో క్రమశిక్షణతో వ్యవహరిస్తూ న్యాయస్థానాలు, న్యాయవాదుల మధ్య సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూసి విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. జిల్లా అదనపు న్యాయమూర్తి ఎ.వాసంతి, సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.రాజ్యలక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విన్నా సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో సోమవారం నుంచి క్యూఆర్ కోడ్ ఆధారిత 5.51 లక్షల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు.

కాల్ సెంటర్‌ను వినియోగించుకోండి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. అర్జీలు పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

హెచ్‌ఎంల సంఘ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ సంఘ భవనంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా వడ్లపట్ల మురళి, ప్రధాన కార్యదర్శిగా జంగం రవీంద్ర, కోశాధికారిగా బుర్ర శ్రీధర్, గౌరవాధ్యక్షుడిగా గారపాటి ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లుగా వి.శ్రీనివాసరావు, ఆర్.శైలజ, వి.హరి సీతారామయ్య ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.సర్వేశ్వరరావు, హెడ్ క్వార్టర్ సెక్రటరీగా పి.సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా ఎస్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎల్‌సీ కేశవరావు వ్యవహరించారు. జిల్లాలో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వము, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి, ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తీర్మానించారు.

భూ సమస్యలపై నేడు ధర్నా

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని భూ సమస్యలపై సోమవారం కలెక్టర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్టు జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలు ఎదుర్కొంటున్న గిరిజనులు, దళితులు, పేదలు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ వాయిదా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డీఎస్సీ–2025కు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు ఆదివారం డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

బాబ్బాబు.. టెండర్లు వేయండి!



'బాబ్బాబు.. ప్లీజ్ బార్‌లకు దరఖాస్తు చేసుకోండి.. ఏదోలా బార్‌లు నడపండి' అంటూ ఎక్సైజ్ అధికారులు బార్ యజమానులను వేడుకుంటున్నారు. రాష్ట్రవాప్తంగా బార్‌ల ఏర్పాటుకు ఇటీవల ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి 2028 ఆగస్టు 31 వరకు నిర్వహించుకునేలా 28 బార్లకు టెండర్లు ఆహ్వానించింది. ఈనెల 18 నుంచి 26 వరకు టెండర్లకు గడువు ఉండగా ఇప్పటివరకూ ఒక్క టెండర్ కూడా దాఖలు కాలేదు. అయితే బార్లకు సంబంధించి అధిక సంఖ్యలో దరఖాస్తులు సేకరించే బాధ్యతపై ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులకు టార్గెట్‌లు విధించినట్టు సమాచారం.

బార్లకు టెండర్లు శూన్యం

- జిల్లాలో 28 బార్లకు నోటిఫికేషన్
- టెండర్లకు 26 వరకు గడువు
- ముందుకు రాని యజమానులు
- నూతన విధానంపై నిరాసక్తత
- బార్లకు నష్టాలు తప్పవన్న భయం
- ఏదోలా టెండర్లు వేయించాలని ఎక్సైజ్ శాఖ హుకుం
- తలలు పట్టుకుంటున్న అధికారులు

తణుకు అర్బన్ : కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే మద్యం దుకాణాల వద్ద అనధికార పర్మిట్ రూమ్‌లు, బెల్ట్ షాపులతో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. దీంతో రాష్ట్రంలో 80 శాతం బార్లు నష్టాల ఊబిలో నడుస్తున్నాయని బార్ యజమానులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ బాగుందని ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా సమయం ప్రకారం మాత్రమే మద్యం విక్రయాలు జరిగేవని, లూజు విక్రయాలు లేకుండా ఉండడంతో వ్యవహారం పారదర్శకంగా ఉండేదని బార్ యజమానులు అంటున్నారు. ఈ కారణంగా బార్లలో మద్యం విక్రయాలు జరుగుతూ రెస్టారెంట్లు కూడా ఆర్థికంగా నిలబెట్టేవని, అయితే ప్రస్తుతం మద్యం దుకాణాల్లో విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతుండడంతో బార్లకు కాలం చెల్లిందని జిల్లావ్యాప్తంగా సగం బార్లకు టెండర్లు పడితే గొప్పని అంటున్నారు.

అధికారుల మల్లగుల్లాలు

రాష్ట్రంలో మద్యం షాపుల ద్వారా విక్రయాలు భారీగా పెరిగినా, బార్ల ద్వారా మరింత ఆదాయం గడించే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికే టార్గెట్‌లతో సతమతమవుతున్న ఎక్సైజ్ అధికారులకు తాజాగా బార్ల టెండర్ల ప్రక్రియ కొత్త తలనొప్పి తెచ్చిపెట్టింది. బార్ల యజమానులను ఎలా ప్రసన్నం చేసుకోవాలి, పెంచిన బార్లకు సంబంధించి నూతనంగా ఔత్సాహికులను ఎలా సేకరించాలంటూ మల్లగుల్లాలు పడుతున్నారు. బార్ యజమానులు మాత్రం బార్‌ల నిర్వహణకు సుముఖంగా లేన్నట్టు బాహాటంగానే చెబుతున్నారు. ఉన్నతాధికారుల టార్గెట్‌లకు తలొంచి ఏదోరకంగా బార్‌లకు దరఖాస్తు చేయించాలని ప్రస్తుత బార్‌ల యజమానులతోపాటు కొత్తగా ఎవరైనా ఆర్థికంగా ఉన్నతస్థాయిలో ఉన్నవారిని బార్‌ల వ్యాపారంలోకి దింపేందుకు సైతం సిద్ధమవ్వాల్సిన దుస్థితి ఎక్సైజ్ అధికారులకు నెలకొంది.

సమయం పెంపు.. సడలింపు

తాజాగా బార్‌ల ఏర్పాటులో ఎక్సైజ్ శాఖ కొన్ని సడలింపులు తీసుకువచ్చింది. మద్యం కొనుగోళ్లలో బార్‌ల యజమానులు ఇన్‌వాయిస్‌పై 15 శాతం అధికంగా వెచ్చించాల్సిన విధానాన్ని తొలగించినట్టు అధికారులు చెబుతున్నారు. అలాగే గతంలో ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండే సమయాన్ని కొత్త ఉత్తర్వుల ప్రకారం గంట అదనంగా రాత్రి 12 గంటల వరకు బార్లను నిర్వహించుకోవచ్చు. అలాగే ఒక బార్‌కు 4 దరఖాస్తులు రాని పక్షంలో లాటరీ తీయలేని పరిస్థితుల్లో నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలు తిరిగి ఇచ్చేసేలా నిబంధనలు సడలించారు.

బార్లకు నోటిఫికేషన్ ఇలా

పట్టణం	బార్లు	పట్టణం	బార్లు
భీమవరం	7	తాడేపల్లిగూడెం	5
తణుకు	6	నరసాపురం	3
పాలకొల్లు	6	ఆకివీడు	1

జిల్లాలో 192 మద్యం షాపులు

ప్రస్తుతం జిల్లాలో 192 మద్యం షాపులు, 24 బార్లు నడుస్తున్నాయి. ఇటీవల నోటిఫికేషన్ ద్వారా మరో నాలుగు బార్లు పెంచి 28 బార్లతో పాటు గీత కార్మికులకు మరో 3 బార్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గడువు సమీపిస్తున్నా టెండర్లు దాఖలు కాకపోవడంతో గడువు పొడిగించే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. బార్లను పెంచి పోషించేందుకు నూతనంగా తీసుకువచ్చిన సడలింపులు ఔత్సాహికులను ఎంతమేర ఆకర్షిస్తాయి, బార్‌లు అన్నింటికీ దరఖాస్తులు దాఖలవుతాయా అన్నది ప్రశ్నార్థకమే. ఈ అంశంపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి ప్రభుకుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా జిల్లాలో బార్ల నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకూ ఎటువంటి టెండర్లు దాఖలు కాలేదని చెప్పారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం



దివ్యాంగుడికి భరోసా ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు చినమిల్లి, ఉమాబాల

భీమవరం అర్బన్: కూటమి ప్రభుత్వంలో కొత్త పెన్షన్లు ఇవ్వక పోగా ఉన్న పెన్షన్లు తీసేయడం దారుణమని వైఎస్సార్ సీపీ భీమవరం ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు అన్నారు. మండలంలోని గొల్లవానితిప్పలో ఆదివారం దివ్యాంగుడు ఆయనకు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా చినమిల్లి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. అధికారం చేపట్టాకా పెన్షన్లు పెంచాల్సింది పోయి ఉన్న దివ్యాంగుల పింఛన్లను రీ వెరిఫికేషన్ పేరుతో తొలగిస్తున్నారని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులు గగ్గోలు పెడుతున్నారన్నారు. ముఖ్యంగా కక్షగట్టి వైఎస్సార్ సీపీకి చెందిన దివ్యాంగుల పెన్షన్లు తొలగిస్తున్నారని, దివ్యాంగులకు పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల ఉన్నారు.

కూటమి పాలన దారుణం

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



వీరవాసరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన అత్యంత దారుణంగా ఉందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు కవురు శ్రీనివాస్ దుయ్యబట్టారు. నౌడూరు జంక్షన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు వందలాది హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ ఎగ్గొట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ పోరాటాల తర్వాత సూపర్ సిక్స్ హామీల్లో కొన్ని అమలు చేస్తున్నారని, వీటిలోనూ ఆంక్షల పేరుతో ప్రజలను వంచిస్తున్నారని మండిపడ్డారు. కదలలేని నిస్సహాయులుగా ఉన్న పలువురు 20 ఏళ్లుగా పింఛన్ పొందుతున్నారని, వారి పింఛన్‌లో కోత విధించడం ఎంత వరకూ సబబు అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో 2024లో ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 66.34 లక్షల మందికి పెన్షన్ అందేదని, ఏటా జనవరి, జూన్‌లో కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారని గుర్తుచేశారు. ముఖ్యంగా దివ్యాంగులను 21 కేటగిరీలుగా గుర్తించి పెన్షన్ అందించారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో సుమారు 5 లక్షల పెన్షన్లలో కోత పెట్టిందని, వీటిలో దివ్యాంగుల పెన్షన్లు 2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు పెన్షన్ల రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులు, మంచంపై ఉన్న నిస్సహాయులను సైతం ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నేతల విషయంలోనూ కూటమి ప్రభుత్వం కక్ష పూరిత ధోరణితో వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



సైకిల్‌పై ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ జీవితంలో సైక్లింగ్‌ను భాగంగా చేసుకోవాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. ఆదివారం ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. వాహనాల వాడకంతో కాలుష్యం పెరుగుతుందని, పరిష్కారంగా సైకిల్‌ను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. గుండె సంబంధిత రోగాల నివారణ, మధుమేహ నియంత్రణ, ఒత్తిడిని తగ్గించడం, శరీర బరువు నియంత్రణ వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు సైక్లింగ్ ద్వారా చేకూరుతాయన్నారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందితో కలిసి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి పెద అమిరం ఎస్పీ క్యాంపు కార్యాలయం వరకు సైకిల్‌పై ర్యాలీ నిర్వహించారు. ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు, భీమవరం రూరల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం

- నాసిరకంగా మరమ్మతులు
- అడుగడుగునా గోతులు
- కూటమి పాలనలో రహదారుల దుస్థితి



పెనుగొండ మండలం దొంగరావిపాలెం వద్ద ప్రమాదకరంగా రహదారి



అండలూరు వద్ద రోడ్డు దుస్థితి



నౌడూరు వద్ద గోతుల మయం

పెనుగొండ : జిల్లాలో ప్రధాన రహదారులు కనీస మరమ్మతులకు నోచుకోక గోతులమయంగా మారాయి. గోతులు లేని రహదారులే లక్ష్యమంటూ కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా ఆచరణలో మాత్రం శూన్యంగా ఉంది. గతేడాది నామమాత్రంగా మరమ్మతులు చేయడంతో తిరిగి రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గోతులన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. జిల్లాలో 700 కిలోమీటర్లకు పైగా రోడ్ల మరమ్మతులను రూ.43 కోట్లతో చేపట్టినా ఫలితం లేదు. ప్రధానమైన 180 పనులకు గాను ఈ మొత్తాన్ని వెచ్చించారు. అయితే పనుల్లో నాణ్యతా లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. చాలా ప్రాంతాల్లో నాసిరకం పనులు చేయడంతో రహదారులన్నీ తిరిగి గోతులమయంగా మారాయి. కొన్ని చోట్ల గుంతల్లో కంకర, చిప్స్ వేసి పైనా వెట్ మిక్స్ వేసి వదలి వేశారు. అయితే ఇవి కనీసం రెండు నెలలు కూడా నిలవలేదు. వర్షాలు, వాహనాల తాకిడికి రోడ్లు గోతులతో నిండిపోతున్నాయి.

ప్రయాణం.. ప్రమాదభరితం

జిల్లా ముఖద్వారం దొంగరావిపాలెం నుంచి మొదలై జిల్లా కేంద్రం భీమవరం ప్రయాణం చేసే వరకూ ప్రయాణికులకు నరకం కనిపిస్తోంది. దొంగరావిపాలెం టోకు మార్కెట్ వద్ద ఇటీవల పూడ్చిన గోతులు మరలా దర్శనం ఇస్తున్నాయి. సిమెంట్ రోడ్డు ఎగువ, దిగువ ఇదే పరిస్థితి. రామన్నపాలెం, వడలి, మల్లప్పదిబ్బల్లోనూ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఇక బ్రాహ్మణ చెరువు, పొలమూరు, నౌడూరుల మధ్య గోతులను వర్ణించలేం. మధ్యమధ్యలో గోతులు పూడ్చేస్తున్నామంటూ నాసిరకం మెటీరియల్ దింపి మమ అనిపించేస్తున్నారు. ఇదే పరిస్థితి అండలూరు రహదారిలోనూ నెలకొంది. పెనుగొండ-పెరవలి, పెనుగొండ-కంతేరు రహదారుల్లోనూ గోతులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లన్నీ వర్షాకాలంలో చెరువులను తలపిస్తూ.. ఎండ కాసినప్పుడు దుమ్ము లేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఆర్భాటపు ప్రకటనలు మాని కనీసం ప్రధాన రహదారుల్లో అయినా గోతులు పూడ్చించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


కనీసం గోతులైనా పూడ్చండి



ప్రధాన రహదారులు గోతులమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలతో గోతులు మరింత పెద్దవి అయ్యాయి. గోతులను నాసిరకం మెటీరియల్‌తో పూడ్చుతున్నారు. ఇవి కనీసం నెల రోజులు కూడా ఆగడం లేదు. దొంగరావిపాలెం వద్ద పడిన గోతులతో మోటార్ సైక్లిస్టులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఓ వ్యక్తి మరణించాడు. ఇప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం రహదారుల్లో గోతులనైనా పూడ్చించండి.

–గుబ్బల వీరబ్రహ్మం, తూర్పుపాలెం

యోగా.. ఉత్సాహంగా..



క్రీడాకారుల విన్యాసాలు

ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు





ముగింపు కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు, విజేతలు

తాడేపల్లిగూడెం: పెంటపాడు మండలం ప్రత్తిపాడులో నాలుగు రోజులపాటు జరిగిన ఆరో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు యోగ సాధకుల విన్యాసాలు ఆకట్టుకున్నారు. 23 జిల్లాల నుంచి సుమారు 550 మంది యోగ సాధకులు ఐదు రకాల కేటగిరీల్లో పోటీపడ్డారు. విజేతలు ఛత్తీస్‌గఢ్, విజయవాడ, ముంబైలో జరిగే పోటీలకు అర్హత సాధించారు. సీనియర్ యోగాసన చాంపియన్‌షిప్ పోటీలు ఛత్తీస్‌గఢ్‌లో, జూనియర్ నేషనల్ యోగాసన పోటీలు విజయవాడలో, సబ్ జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలు ముంబైలో జరుగనున్నాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో 87 మంది స్వర్ణ, 87 మంది రజత, 86 మంది కాంస్య పతకాలు సాధించారు. ముగింపు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీఎస్పీ విశ్వనాథ్ మాట్లాడుతూ యోగా అనేది నిత్య జీవితంలో ప్రతిఒక్కరికి అవసరమన్నారు. ఒత్తిళ్లను అధిగమించడానికి ఉపకరిస్తుందన్నారు. ముదిమి వయసులోనూ ఉత్సాహంగా ఉండేందుకు యోగా దోహదపడుతుందన్నారు. జాతీయ పరిశీలకుడు నంద కృపాకర్, అధ్యక్షురాలు అనంతనేని రాధిక, ప్రేమ్‌కుమార్, రాజశేఖరరెడ్డి, వెంకటరమణ, దుర్గారావు పోటీలను పర్యవేక్షించారు. యోగా పోటీల నిర్వాహకులు మాధవరావు, కరిబండి రామకృష్ణ, కోశాధికారి వెంకటేశ్వరరాజులు పాల్గొన్నారు. అతిథులు చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. యోగా బృంద సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్దిలో హనుమద్ హోమం



మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమద్ హోమం ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈవో ఆర్‌వీ చందన మాట్లాడుతూ స్వామి వారి సన్నిధిలో హోమం ప్రతి ఆదివారం భక్తులకు ఆర్జిత సేవగా దేవస్థానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షిస్తున్నట్లు ఈవో తెలిపారు.

26న తణుకులో ఫెన్సింగ్ టీం ఎంపిక

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఫెన్సింగ్ వ్యక్తిగత, టీం విభాగాల్లో బాలురు, బాలికలకు ఎంపికలు ఈనెల 26న తణుకు మండలం తేతలిలోని స్టెప్పింగ్‌స్టోన్ స్కూలులో నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2025 డిసెంబరు 31కి 17 సంవత్సరాల్లోపు వయసు ఉండాలని, ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి గుర్తింపు కార్డుతో వ్యక్తిగత ఫెన్సింగ్ క్రీడా పరికరాలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30న భీమవరంలో నిర్వహించనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఇతర వివరాలకు 96802 34566 నెంబరులో సంప్రదించాలని కోరారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఉండి: తల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తాననడంతో మనస్తాపంతో కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం ఉండి పడవలరేవుకు చెందిన బొబ్బాది కృష్ణ(45) భార్యతో విడిపోయి తల్లి దగ్గరే ఉంటున్నాడు. మద్యానికి బానిసైన అతను తల్లిని కూడా హింసిస్తుండటంతో ఆమె ఈ నెల 23న పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో మనస్తాపానికి గురైన అతను పురుగుల మందు మద్యంలో కలిపి తాగడంతో పరిస్థితి విషమించింది. అతనిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

29న కైకలూరులో జాబ్ మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. జితేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18–30 సంవత్సరాల వయసు వారు అర్హులన్నారు. 6281119575, 9676140314 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

టీడీపీ నేత అరాచకంపై ఆగ్రహం

- జంగారెడ్డిగూడెం లేఅవుట్ కాలనీ వాసుల ఆందోళన
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన కాలనీ



రక్షణ కల్పించాలని లేఅవుట్ కాలనీ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వంలో సాక్షాత్తు తమ నాయకులతో సహా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. జంగారెడ్డిగూడెంలో బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీకి చెందిన ఓ సీనియర్ టీడీపీ నాయకుడిపై అదే కాలనీకి చెందిన ఓ టీడీపీ నేత, అతని కుటుంబ సభ్యులు, మరికొంతమంది దాడి చేసి గాయపరిచారు. అడ్డు చెబితే చంపేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. బాటగంగానమ్మ లే అవుట్ కాలనీకి చెందిన ఎం.ఫకీర్ నాయుడు టీడీపీలో ఉంటూ కొన్ని సంవత్సరాలుగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో స్థానికుల సహకారంతో పార్టీలకు అతీతంగా వినాయకుడి గుడిని నిర్మిస్తున్నారు. ఆ ప్రాంతంలో కొత్తగా టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శిగా పదవి చేపట్టిన ఒక నాయకుడు ఫకీర్ నాయుడు వద్దకు వచ్చి ఉత్సవాలు చేయడానికి వీల్లేదని బెదిరించడమే కాకుండా రాళ్లతో దాడి చేశారు.

మహిళలపై దాడులు

ఆ ప్రాంతంలో కూటమికి చెందిన మహిళలు సైతం అక్కడ టీడీపీ నేత అరాచకాలకు ఏం చేయాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రయితే ఇంటి నుంచి బయటకు రావాలంటే భయం వేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా టీడీపీ నాయకుడే చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మద్యంతోపాటు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు సేవిస్తూ, సైరన్ శబ్దాలతో కాలనీ వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇదేంటని అడిగిన పెద్దలపై దాడులకు తెగబడటమే కాకుండా మహిళల మీద కూడా దాడులు చేస్తున్నార న్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరేడు నెలలుగా కాలనీలో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నామన్నారు. పోలీసులు జోక్యం చేసుకుని తమకు ఈ ప్రాంతంలో రక్షణ ఏర్పాటు చేయాలని, ఉత్సవాలలో ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది



ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోయాయి. రాత్రి ఒంటి గంట వరకు మద్యం తాగి హల్‌చల్ చేస్తున్నారు. అడిగితే దాడికి పాల్పడుతున్నారు. గత వినాయక చవితికి చాలా గొడవలు జరిగాయి. మళ్లీ ఏగొడవలు జరుగుతాయోనని భయంగా ఉంది. శనివారం రాత్రి సైరన్ మోగుతోందని పోలీసులు వచ్చారనుకున్నాం. ఓ యువకుడు బైక్‌పై పోలీసు సైరన్‌లో హడావుడి చేశాడు. ఇదంతా టీడీపీ నాయకులే నడిపిస్తున్నారు.

– భారతి, లేఅవుట్ కాలనీ, జంగారెడ్డిగూడెం

రూ. 50 వేలు లంచం తీసుకున్నారు



కూటమి అధికారంలో వచ్చిన తరువాత టీడీపీ నాయకుడు వచ్చి ఇక్కడ తాను చెప్పిందే చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. శనివారం రాత్రి యువకులతో కలిసి వచ్చి నా తల పగులగొట్టారు. వినాయకుడి గుడి కట్టిస్తుంటే అవినీతి అంటూ ఆరోపిస్తున్నారు. నేను చిన్న ఫ్యాక్టరీ పెట్టుకుంటే నా నుంచి రూ. 50 వేలు లంచం తీసుకున్నారు. మరో రూ.50 వేలు అడుగుతున్నారు.

– ఫకీర్ నాయుడు, లేఅవుట్ కాలనీ, జంగారెడ్డిగూడెం

ఆదివాసీ జిల్లాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బంధం ప్రసాద్

వేలేరుపాడు: షెడ్యూల్ ప్రాంత పరిపాలన సౌలభ్యం కోసం ఆదివాసి జిల్లాలు ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి బంధం ప్రసాద్ అన్నారు. ఆదివారం గిరిజన సంక్షేమ పరిషత్ ముఖ్య నాయకుల సమావేశం వేలేరుపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఏలూరు ఏజెన్సీ ప్రాంతం పోలవరం జిల్లాగా, తూ.గో. జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం ప్రత్యేక ఆదివాసి జిల్లాగా ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. 5 షెడ్యూల్ ప్రాంతంలో హక్కులకు తీవ్రమైన విఘాతం కలుగుతుందని, ఇప్పటికీ ఏజెన్సీ ప్రాంతంలో బయట ప్రాంతాల వారి వలసలు పెరిగిపోవడం వల్ల ఆదివాసులు తీవ్రమైన అన్యాయానికి గురి అవుతున్నారన్నారు. ఆదివాసి హక్కులు చట్టాలు అమలు చేయడం కష్టమవుతుందని దీనివల్ల ఆదివాసులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రుల బృందం తూర్పు ఏజెన్సీ ప్రాంతంలో అక్కడ పర్యటించి ఆదివాసి గిరిజన సంఘాల ప్రజాభిప్రాయ సేకరణ వినతులు స్వీకరించాలని కోరారు. సమావేశంలో గిరిజన సంక్షేమ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

మిస్టర్ భీమవరం బాడీ బిల్డింగ్ పోటీలు



మిస్టర్ భీమవరం బాడీ బిల్డింగ్ పోటీల దృశ్యం

భీమవరం: మిస్టర్ భీమవరం బాడీ బిల్డింగ్ పోటీలు న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం త్రీ టౌన్‌లోని ఓ.12 జిమ్‌లో ఆదివారం నిర్వహించారు. పోటీలను దాసి వరప్రసాద్ ప్రారంభించగా, బాడీ బిల్డింగ్ మొదటి గ్రూపు విజేతలకు మానవతా సంస్థ భీమవరం శాఖ అధ్యక్షులు చింతలపాటి రామకృష్ణంరాజు, కో చైర్మన్ కారుమూరి నరసింహామూర్తి బాబు, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షులు అల్లు శ్రీనివాసు బహుమతులు అందించారు. నిర్వాహకుడు న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ విభాగంలో మిస్టర్ భీమవరం విజేతగా ఎస్‌కె యాసీన్, ఫిజిక్ మోడలింగ్ విభాగంలో మిస్టర్ భీమవరం విజేతగా సతీష్ నిలిచారని తెలిపారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. పాలపొంగళ్ళశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు.

రంగా విగ్రహాన్ని అవమానించినవారి కోసం ముమ్మర గాలింపు

కైకలూరు: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఏలూరు జిల్లా, కలిదిండి, సానారుద్రవరం రంగా విగ్రహాలను పేడతో అవమానించిన దుండగులను పట్టుకోడానికి పోలీసులు ముమ్మర గాలింపు చేపట్టారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలతో 5 ప్రత్యేక బృందాలు జల్లెడ పడుతోన్నాయి. ఇప్పటికే సీసీ పుటేజీలను పోలీసులు సేకరించారు. మొత్తం 10 మంది పోలీసు ఉన్నతాధికారులు, 30 మంది పోలీసు సిబ్బంది కేసు చేధించే పనిలో ఉన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కలిదండి సమీప గ్రామాలకు చెందిన యువకులే ఈ ఘటనకు పాల్పడినట్లు భావిస్తున్నారు. కొంత మంది అనుమానితులను కైకలూరు పోలీసు స్టేషన్‌లో విచారిస్తోన్నట్లు తెలిసింది. సోమవారం సాయంత్రానికి కేసు కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయని సీఐ వి.రవికుమార్ ఆదివారం చెప్పారు.

సర్వీస్ రోడ్లు నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్

టి.నరసాపురం: గ్రీన్ ఫీల్ హైవేకు సర్వీస్ రోడ్ల ప్రొవిజన్ కల్పించాలని.. పరిహారం పెంచాలని, భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం టి.నరసాపురం శివాలయం ప్రాంగణంలోని కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో హైవే భూ నిర్వాసిత రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రైతుల పోరాట కమిటీ నాయకులు దేవరపల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 2న జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం వద్ద హైవే దిగ్బంధం చేపట్టాలని సదస్సు నిర్ణయించింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారని విమర్శించారు. సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాలకు ఎగ్జిట్స్ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో రైతుల పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు, పర్వతనేని మురళి, మాలెంపాటి హరిబాబు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో దూకి ఆత్మహత్య



మజ్జి గాంధీ(ఫైల్)

ఆకివీడు: ఉప్పుటేరు వంతెన వద్ద శనివారం రాత్రి స్థానిక శ్రీరాంపురానికి చెందిన మజ్జి గాంధీ(57) అనే వ్యక్తి ఉప్పుటేరులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం గాలింపు చర్యలు చేపట్టగా వంతెన సమీపంలో మృతదేహం లభ్యమైంది. ఇంటి నుంచి శనివారం రాత్రి సైకిల్‌పై బయటకు వెళ్లాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో వెతకడం ప్రారంభించారు. ఉప్పుటేరు వంతెనపై అతని సైకిల్ కన్పించడంతో దూకేసి ఉంటాడని భావిస్తున్నారు. ఏఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యసాయి పథకం కార్మికుల సమ్మె విరమణ

పోలవరం రూరల్: సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు గత మూడు రోజులుగా చేస్తున్న సమ్మెను ఆదివారం రాత్రి విరమించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని ఆదివారం కలిసి వర్కర్ల సమస్యలను తెలిపారు. జెడ్పీ సీఈవో శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాథ్‌ల సమక్షంలో యూనియన్ సభ్యులకు హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో జిల్లా పరిషత్ నిధుల నుంచి ఒక నెల జీతం చెల్లిస్తామని, మిగిలిన పెండింగ్ జీతాలు 15 రోజుల్లో చెల్లించేందుకు కృషిచేస్తామన్నారు.

పెద్దింట్లమ్మను దర్శించుకున్న భక్తులు

కైకలూరు: అమ్మా.. కొల్లేటి పెద్దింట్లమ్మా.. మొక్కులు తీర్చుకుంటున్నాం.. మా కోర్కెలు తీర్చమ్మా.. అంటూ భక్తులు అమ్మను ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద సమీప జిల్లాల నుంచి భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున విచ్చేశారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారికి వేడి నైవేద్యాలు, పొంగళ్లను సమర్పించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలు అందించారు.

మోదేలు.. ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

- మోదేలు గ్రామానికి నిలిచిన రహదారి, విద్యుదీకరణ పనులు
- రిజర్వ్ ఫారెస్టు కారణంగా అనుమతి లేదంటున్న అధికారులు
- కొండ దిగి వస్తే సౌకర్యాలు కల్పిస్తామంటున్న ఐటీడీఏ పీఓ
- సెప్టెంబర్ 1న మోదేలును సందర్శించనున్న ఎస్టీ కమిషన్ బృందం



మోదేలు గ్రామం

బుట్టాయగూడెం: మారుమూల ప్రాంతమైన మోదేలు గ్రామానికి మంజూరైన గృహాలు నిర్మించడంతోపాటు రోడ్డు, విద్యుత్ సదుపాయం కల్పించాలని ఆ గ్రామ గిరిజనులు కోరుతున్నారు. బ్రిటిష్ కాలంలోనే అటవీ, పోడు భూముల వ్యవసాయం కోసం తమ గ్రామాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని ప్రస్తుతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండకూడదంటూ తమకు మంజూరైన ఇళ్ల నిర్మాణం, విద్యుత్, రోడ్డు నిర్మాణం పనులను ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఉంటున్న తమను అక్కడి నుంచి ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని దీనివల్ల తీవ్రంగా నష్టపోతామంటూ కొండరెడ్డి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండ దిగి వస్తే సౌకర్యాలు కల్పిస్తాం

మోదేలు గ్రామం పాపికొండల అభయారణ్యం పరిధిలోకి వస్తుందని అందువల్లే అక్కడ ఇళ్ల నిర్మాణానికి, గ్రామానికి రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అనుమతులు ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఆయా ప్రాంతాల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరగాలనే ఉద్దేశంతోనే అభయారణ్యం పరిధిలో ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదంటూ అధికారులు చెబుతున్నారు. కొండదిగి వస్తే దిగువ ప్రాంతంలో ఇళ్లు నిర్మించి వారికి మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ రాములు నాయక్ చెబుతున్నారు.



అటవీ ప్రాంతంలో ఉన్న మోదేలు గ్రామానికి వెళ్ళే రహదారి

ఢిల్లీకి లేఖ రాసిన మోదేలు గిరిజనులు

స్వాతంత్ర్యం రాకముందే ఏర్పడిన తమ గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు కృషి చేయడం లేదని తమను అక్కడి నుంచి ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని తామున్న ప్రదేశంలోనే తమకు మంజూరైన 23 ఇళ్ల నిర్మాణంతోపాటు రోడ్డు నిర్మాణం, విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ రాష్ట్రపతికి ఒక లేఖ రాశారు. జాతీయ గిరిజన కమిషన్‌కు కూడా లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితిని పరిశీలించేందుకు సెప్టెంబర్ 1న జాతీయ ఎస్టీ కమిటీ బృందం పర్యటిస్తున్నట్లు గిరిజనులు చెబుతున్నారు. కమిటీ రాకతో తమ సమస్య తీరుతుందనే ఆశతో అడవి బిడ్డలు ఎదురు చూస్తున్నారు.




అటవీ ప్రాంతంలో నివసిస్తున్న మోదేలు గ్రామస్తులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధుల మంజూరు

వైఎస్సార్‌సీపీ పాలనా సమయంలో మోదేలు గ్రామానికి సుమారు రూ.70 లక్షల వ్యయంతో విద్యుత్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారు. ఫారెస్ట్ అధికారుల అభ్యంతరాలతో ఆ పనులు నిలిచిపోయాయి. గత ఏడాది పీఎంజేఎస్‌వై నిధులతో సుమారు 23 ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలకు ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు చెప్పడంతో అవి కూడా నిలిచిపోయాయి.

ఉన్న చోటే ఇళ్లు నిర్మించాలి



మేం ఉంటున్న మోదేలు గ్రామంలోనే మాకు మంజూరైన 23 ఇళ్లు నిర్మించాలి. విద్యుత్ సదుపాయం కల్పించాలి. రోడ్డు పనులు పూర్తి చేయాలి. అక్కడి నుంచి కదలం, కొండ దిగం. మా వ్యవసాయ భూములన్నీ అక్కడే ఉన్నాయి.

కెచ్చెల బాలిరెడ్డి, మోదేలు

పోడు భూముల కోసమే



పోడు భూముల కోసమే మోదేలు గ్రామాన్ని బ్రిటిష్ కాలంలోనే ఏర్పాటు చేసుకున్నాం. అప్పటి నుంచి ఆహార ఉత్పత్తులు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు చెప్పడం వల్ల మాకు అన్యాయం జరుగుతుంది.

కెచ్చెల భవాని, మోదేలు

క్లుప్తంగా

ఇంటింటికీ ఉచిత వైద్యం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు వైద్యసేవలందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ప్రత్యేక వాహనం ద్వారా ఐదుగురు రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. దాత కాకరపర్తి సత్యవతి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లు ఐకమత్యంతో ఉద్యమించాలి



సమావేశంలో పాల్గొన్న స్కీమ్ వర్కర్లు

తాడేపల్లిగూడెం రూరల్: స్కీమ్ వర్కర్లు ఐకమత్యంతో హక్కుల సాధనకు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, నాయకులు సిరపరపు రంగారావు పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లిగూడెం పట్టణం సీఐటీయూ కార్యాలయంలో రూరల్ మండల రెండో మహా సభ దీన స్వరూపారాణి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, స్కీమ్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



దుకాణదారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

అత్తిలి: మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల డీలర్లు అమ్మిన ఎరువులను ఈ పాస్‌లో స్టాక్ తీయాలని, అలాగే రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎరువులను నాణ్యత పరీక్షలకు పంపించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి టీకే రాజేష్, జిల్లా టెక్నికల్ ఏవో కృష్ణకాంత్ పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: పేకాట ఆడుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జేవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జగన్నాథపురం శివారు చెరువు సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం రాత్రి రూరల్ పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారివద్దనుంచి రూ.9,020 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై ప్రసాద్ వివరించారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

అత్తిలి: మండలంలోని మంచిలి గ్రామానికి చెందిన ఉద్దరాజు ఫణి దుర్గా ప్రసాద్ అనే యువకుడు గత నెల 30 నుంచి కనిపించడం లేదనే ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.ప్రేమ్‌రాజు తెలిపారు. ఫణి దుర్గా ప్రసాద్ చేపల చెరువు వద్ద పని చేసే వాడని గత నెల 30న పనికి వెళ్లి రాలేదంటూ దుర్గా ప్రసాద్ తల్లి రాధాకుమారి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలి

అత్తిలి: ఉద్యోగ, కార్మికులు ఐక్య పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీవీ ప్రతాప్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ అత్తిలి మండల మూడో మహాసభ కె.ధర్మేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మిక చట్టాలు సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు సమస్యలతో సతమతవుతుంటే పాలకులు మాత్రం 100 రోజులు పరిపాలన పూర్తి చేశామని పండుగలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఆశా, అంగన్‌వాడీ వీవోఏ, బిల్డింగ్, గ్రామ పంచాయతీ, వీఆర్ఏ తదితర రంగాల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించిందని వాటన్నిటిలోనూ అత్తిలి కార్మిక వర్గం భాగస్వామ్యం అయ్యారన్నారు. అనంతరం నూతన కమిటీ ఏర్పడింది.

ఏం కొనలేం.. తినలేం!

- సామాన్యులకు నిత్యావసర ధరల భారం
- అదే బాటలో కూరగాయల ధరలు
- రోజు రోజుకూ పెరుగుతున్న ధైనం
- పట్టనట్లు వ్యవహరిస్తున్న నియంత్రణ అధికారులు



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన కూరగాయలు

తాడేపల్లిగూడెం అర్బన్: నిత్యావసర సరుకుల ధరలతో పాటు కూరగాయల ధరలు సామాన్యుడిని బేజారెత్తిస్తున్నాయి. దీంతో ఏం కొనలేం.. తినలేం అన్న చందంగా మారింది సామాన్యుల పరిస్థితి. ఆదివారం తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. ఉల్లిపాయలు ప్రతి వారం మాదిరిగానే నాణ్యతను బట్టి కిలో రూ.30 నుంచి రూ.40 ధర పలికాయి. పచ్చిమిర్చి తెల్లవి కిలో రూ.80 పలకగా సాధారణ పచ్చిమిర్చి రూ.60లకు విక్రయించారు. టమాటాలు గత వారం రూ.80 కాగా ఈ వారం కిలో 60లు ధర పలికాయి. తెల్ల వంకాయలు కిలో రూ.80లు అయితే అరకిలో రూ.50లకు అమ్మకాలు చేశారు. చిక్కుడుకాయలు కిలో రూ.100 పావు కిలో రూ.30లకు విక్రయించారు. బంగాళా దుంపలు రూ.30 నుంచి రూ.40, గత రెండు వారాల నుంచి బెండకాయలు, దొండకాయలు కిలో రూ.60లకు, చేమదుంప రూ.60 నిలకడగాఉన్నాయి. గత వారం క్యారెట్ కిలో రూ.60లకు విక్రయించగా ఈ వారం అదే విధంగా విక్రయించారు. బీట్‌రూట్ కిలో రూ.60, కూరగాయల్లో ఎప్పటికీ అత్యధిక ధర పలుకుతున్నా, ఈ వారం మాత్రం క్యాప్సికం అత్యధిక ధర పలికింది. దీంతో క్యాప్సికం కిలో కిలో రూ.100 పలికింది. పొట్లకాయ రూ.40, దోసకాయ రూ.40, గత వారం, ఈ వారం కంద రూ.100లకే విక్రయించారు. కొత్తిమీర ఒక్కటి మాత్రం సామాన్యుడికి అందుబాటులో ఉన్నట్లుగా కట్ట రూ.25లకు విక్రయాలు సాగాయి. దొండకాయలు, బెండకాయలు, వంకాయలు, పచ్చిమిర్చితో పాటు కొన్ని కూరగాయలను తాడేపల్లిగూడెం పరిసర గ్రామల రైతులవద్ద నుంచి రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేస్తారు. కూరగాయల దుకాణదారులు రైతుల వద్ద నుంచి అతి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తారు. అనంతరం వినియోగదారులకు భారీ ధరలకు విక్రయిస్తారు. ఉదాహరణకు రైతు పండించిన పొడుగు చిక్కుడు కాయలను కిలో పదుల సంఖ్యలో కొనుగోలు చేసి వినియోగదారులకు వందల్లో విక్రయిస్తారు. రైతు పండించిన పంటకు సరైన ధర పలకదు సరికదా వినియోగదారులకు విక్రయించిన ధరలకు పొంతనలేని విధంగా మూడురెట్లు ఎక్కువ ధరలకు విక్రయిస్తారు. కూరగాయలు పండించిన రైతులకు గిట్టుబాటు ధర అందకపోగా వినియోగదారులకు భారీగా అధిక ధరలకు విక్రయిస్తారు. అటు రైతు సరైన ధర రాక నష్టపోతుంటే ఇటు వినియోగదారులు అధిక ధరలకు కూరగాయలు కొనుగోలు భారీగా నష్టపోతున్నారు.

రైతు బజారు లేకపోవడమే కారణం

పట్టణంలో 20 ఏళ్ల క్రితం పట్టణ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న రేకుల గోడౌన్‌లో రైతు బజారు ఏర్పాటు చేసి రైతులు పండించిన కూరగాయలను విక్రయించుకొనేలా తూతూమంత్రంగా సంబంధిత అధికారులు నిర్వహించారు. రేకుల గోడౌన్ కావడంతో పగలు వ్యాపారం కొనసాగించి రాత్రి మూసి వేయడంతో కూరగాయలు త్వరగా పాడై రైతులు నష్టపోయే వారు. దీంతో కూరగాయల వ్యాపారం చేయలేమని దుకాణదారులకు హోల్‌సేల్‌గా అమ్ముకోవడమే తమకు వెసులుబాటుగా భావించి రైతుబజారులో వ్యాపారాలు చేయడం మాని వేశారు. అప్పట్లో వేగంగా ఏర్పాటు చేసిన రైతు బజారు అత్యంత వేగంగా కనుమరుగైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా రైతులకు, వినియోగదారులకు సౌకర్యవంతమైన రైతుబజారును ఏర్పాటు చేస్తే ప్రజలకు ధరల బాదుడు తప్పుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నేతాజీ సోషల్ సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయం



దువ్వలో ఫ్రీజర్‌ను ప్రారంభించిన సొసైటీ సభ్యులు

తణుకు అర్బన్: నేతాజీ సోషల్ సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో ఎస్సీ ఏరియా, గ్రామస్తుల సహకారంతో ఫ్రీజర్‌ని కొనుగోలు చేసినట్లు ఈ సంస్థ అధ్యక్షుడు సిర్రా ధనరాజు తెలిపారు. ఆదివారం స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద ఫ్రీజర్‌ను గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు. గ్రామంలో ఎవరికి అవసరం వచ్చినా ఉపయోగించుకోవచ్చని రానున్న కాలంలో గ్రామానికి ఒక అంబులెన్స్‌ను కొనుగోలు చేస్తున్నామని ప్రజలకు అవసరమైన పనులు చేయడానికి గ్రామస్తులు తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రుద్రా ధనరాజు, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీలు పెనుమాక అశోక్, తాతపూడి శ్రీనివాస్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మల్లెల డేవిడ్, పత్తి రామకృష్ణ పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలి



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న టూటౌన్ సీఐ కాళీచరణ్



వినాయక పత్రిమలు, వ్రత పూజ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని మైత్రి కాలనీస్ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక ప్రతిమలు, వ్రత పూజ పుస్తకాలను ఎమ్మెల్యే అంజిబాబు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టితో తయారు చేసిన వినాయకులతో పర్యావరణానికి ఎంతో మేలని, ప్రజలందరూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా కెమికల్స్ లేని మట్టి వినాయకులను ప్రతిష్ఠించి, పూజించాలని సూచించారు.

మట్టి విగ్రహాల పంపిణీ

వినాయక చవితి పండుగ పురస్కరించుకుని ఇళ్లల్లో, బహిరంగం వేదికల్లో జరిగే ఉత్సవాల్లో మట్టి వినాయకుని ప్రతిమలను పూజించాలని టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ అన్నారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సీఐ చేతుల మీదుగా మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ జి.కాళీ చరణ్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన పెద్ద పెద్ద విగ్రహాలతో జల కాలుష్యమై అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. నిర్వాహకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ మానవత సంస్థ గౌరవ డైరెక్టర్ పెన్మెత్స రామ్మోహన వర్మ (పూనా రాము) సౌజన్యంతో 200 మందికి ఉచితంగా వినాయక ప్రతిమలను పంపిణీ చేసినట్లు చెప్పారు. టూటౌన్ ఎస్సై రామారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వినాయక ప్రతిమల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను పూజించాలని మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ అన్నారు. భీమవరం మెంటేవారి తోటలో ఆదివారం భగవద్గీత శిక్షణ పొందుతున్న 108 మంది చిన్నారులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా అందరూ మట్టి గణపతులను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో చిన్నారులు మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ఎల్.అగ్రహారంలో సీఎం, డిప్యూటీ సీఎంలకు ఉత్తరాలు రాసిన కార్మికులు

తాడేపల్లిగూడెం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చస్తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించిందని గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి పాలూరి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో యూనియన్ పిలుపు మేరకు సీఎం, డిప్యూటీ సీఎంలకు ఉత్తరాలు రాసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు దయ్యం పాండురంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అనుకూలంగా అడుగులు వేయడం లేదన్నారు. సంక్షేమ బోర్డు నుంచి పథకాలు అమలు కాక దిక్కులేని వారిగా యజమాని దయాదాక్షిణ్యాలపై ఆధారపడి కార్మికులు జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాయకులు దంగేటి నారాయణరావు, మంచాల ఏసు, కామిరెడ్డి జగన్, బడివిరెడ్డి సురేష్, పాప్పాప్పుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు వైద్యుడు భాస్కర్‌రావుకు ఐఎంఏ సంతాపం



భాస్కర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐఎంఏ వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ మత్తు వైద్యుడు డాక్టర్ గద్దె రామకృష్ణ భాస్కర్‌రావు మృతికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్యులు సంతాపం తెలిపారు. స్థానిక కమ్మ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సంతాప సభలో సీనియర్ వైద్యులు డాక్టర్ తాతిన రామబ్రహ్మం మాట్లాడుతూ మత్తు వైద్యుడిగా చివరి నిముషం వరకు వైద్య సేవలు అందించి తనువు చాలించిన భాస్కర్‌రావు వైద్య వృత్తిలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు కుడారి ఆనంద్, ముదునూరి సుబ్బరాజు, వైద్యులు వెలిచేటి సుందరరావు, కర్రి శ్రీనివాసుల రెడ్డి, సుంకవల్లి రామకృష్ణ, జీవీ సతీష్‌రెడ్డి, బంగారు రవిరాజు, బి.దుర్గామహేశ్వరరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పోరాటం.. ప్రజాపక్షం



మాట్లాడుతున్న చినిమిల్లి వెంకటరాయుడు, చిత్రంలో నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి ఉమాబాల

భీమవరం అర్బన్: ప్రజల తరుపున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తోందని, చంద్రబాబు మోసపూరిత పాలనను కలిసికట్టుగా ఎండగడదామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని గొల్లవానితిప్ప, యనమదుర్రు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో గ్రామ స్థాయి విస్తృత స్థాయి సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చినిమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ పేదలను గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు. కానీ చంద్రబాబు మోసపూరిత మాటలతో మభ్యపెట్టి ప్రజలు మరోసారి మోసం అధికారం కైవసం చేసుకున్నాడని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చానిర, కానీ ఎంతమందికి గ్యాస్ సిలిండర్లు డబ్బులు జమ అయ్యాయో, తల్లికి వందనం ఎంతమంది అందిందో, ఉచిత బస్సు పేరుతో ఎన్ని బస్సులు తిప్పుతున్నారో రాష్ట్ర ప్రజలకు తెలుసని అందుకే ఏడాది పాలనలోనే అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత మూటగట్టుకున్నారన్నారు.

అండగా ఉంటాం

నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత్రృత్వ పాలన సాగుతుందని ఎదురించిన వారిని జైల్లో పెడుతున్నారని, ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చంద్రబాబు మోసంపూరిత పాలనను ఇంటింటికి వెళ్లి వివరిద్దామన్నారు. పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శివులూరి దత్తాత్రేయ వర్మ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసే బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. అనంతరం గ్రామ కమిటీలను నియమించి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, మండల అధ్యక్షుడు జల్లా కొండయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏఎస్ రాజు, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, మాజీ సర్పంచ్ బోకూరి విజయరాజు, మాజీ ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, మాజీ ఎంపీటీసీ పెనుమాల నరసింహస్వామి, కొప్పర్తి రాంబాబు, బేతాళ సంతోష్, కొల్లి పెద్దిరాజు, గుద్దటి రామాంజనేయులు, సాదే నాగరాజు పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలి



సీసలి రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మారావు తదితరులు

కాళ్ల: నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని జుత్తుగ నాగరాజు అన్నారు. సీసలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఆలయం ప్రాంగణంలో నిర్వహించారు. దేవస్థానం చైర్మన్‌గా గణేశ్న పద్మారావు, సభ్యులుగా పి.శ్రీదేవి, ఎం.మంగతాయారు, సీహెచ్.శివనాగాంబ, బి.వీరస్వామి, టి.గోపి, ఎన్. జయలక్ష్మి, ఏ.సూర్యకుమారిలతో పాటు ఎక్స్ అఫీషియో మెంబెరుగా పి.శ్రీనివాసరావుతో దేవాదాయ శాఖ భీమవరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో కొవ్వాడ దివ్యశ్రీ, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, కోరా రామ్మూర్తి, మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, నూకల భోగేంద్రబాబు, ఏఎంసీ డైరెక్టర్ వాస్కూరి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆయుర్వేద వైద్యశాల



శిథిలావస్థకు చేరుకున్న ఆయుర్వేద వైద్యశాల



పెచ్చులూడుతున్న శ్లాబ్

వీరవాసరం: స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. కొద్దిపాటి వర్షానికే శ్లాబుల్లో లీకులు అయ్యి గదులన్నీ నీటితో నిండిపోతున్నాయి. తలుపులు, కిటికీలు సైతం ధ్వంసమయ్యాయి. 1972వ సంవత్సరంలో కోడూరి వెంకయ్య శ్రీమతి పుల్లమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులచే అప్పటి సమితి ప్రెసిడెంట్ యరకరాజు వెంకట రామరాజు, అప్పటి గ్రామ సర్పంచ్ బోను నారాయణగార్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనాన్ని నిర్మించారు. ఈ వైద్యశాల ద్వారా వీరవాసరం పరిసర ప్రాంతాల్లోని బాలేపల్లి, మెంటేపూడి, మత్స్యపురిపాలెం, దూసనపూడి, వడ్డిగూడెం, బొబ్బనపల్లి, మత్స్యపురి, పెర్కిపాలెం, నందమూరి గరువు, శృంగవృక్షం, శివదేవుని చిక్కాల, తోకలపూడి, చింతలకోటి గరువు రాయకుదురు తదితర గ్రామాల నుంచి వచ్చి రోగులు వైద్యం చేయించుకుంటారని ఆయుర్వేద వైద్యుడు ఎం రామచందర్ తెలిపారు.

29న నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని వివరించారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

సాహసంగా మారిన ప్రయాణం



జారుడుబల్లను తలపిస్తున్న స్థానిక సమతానగర్ రోడ్డు



అధ్వానంగా ఉన్న చినకాపవరం-రామయ్యగూడెం రోడ్డు

ఆకివీడు: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని చినకాపవరం-రామయ్యగూడెం, రాజులపేట రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. స్థానిక సమతానగర్ రోడ్డు జారుడుబల్లను తలపిస్తోంది. గుంతలుగా ఉన్న ఈ రోడ్డులో గ్రావెల్ వేయడంతో రోడ్డు బురదమయమైంది. చినకాపవరం డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో సమతానగర్ రోడ్డు బురదమయంగా మారిందని, ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే భయపడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాలు ఉన్న ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నా రామయ్యగూడెం రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో చినకాపవరం శివారు రామయ్యగూడెం, ఇతర శివారు గ్రామాలకు, చెరువుల వద్దకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందికరంగా ఉందని, రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికుడు కురెళ్ల పోలు కోరుతున్నారు.

పెద్దింటి అమ్మవారికి నల్లపూసల గొలుసు

ఆకివీడు: ఆకివీడు గ్రామ దేవత పెద్దింటి అమ్మవారికి రూ.1.30 లక్షల విలువైన 12 గ్రాముల బంగారు నల్లపూసల గొలుసును స్థానిక సంతపేటకు చెందిన నెల్లి దుర్గారావు కుమారుడు వీర కుమార్, ఉమా మహేశ్వరి దంపతులు సమర్పించారు. ఆలయ చైర్మన్ గొంట్లా గణపతి, ఈఓ అల్లూరి సత్యనారాయణరాజుకు నల్లపూసల గొలుసును అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు సీనియర్ సిటిజన్స్ అష్టావధానం

నరసాపురం: పట్టణంలోని గోదావరిగట్టున ఉన్న అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఓ వినూత్న కార్యక్రమాన్ని నరసాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చేపట్టింది. మొత్తంగా సీనియర్ సిటిజన్స్‌తో అష్టావధానం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉత్సాహవంతులు, తెలుగు భాషాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నరసాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అందే రంగారావు ఆదివారం విలేకరులకు తెలిపారు.